## పెద్దపల్లి కలెక్టర్ పెద్ద మనసు

- అనాథ యువతి పెండ్లి జరిపించేందుకు ముందుకొచ్చిన కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 16 : పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దమనసు చాటుకున్నారు. అనాథ యువతి మానస వివహం జరిపించేందుకు ముందుకొచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయిన మానస (20) తన చెల్లితో కలిసి రామగుండంలోని తబిత బాలల సంరక్షణ కేంద్రంలో పదహారు ఏళ్లుగా ఉంటుంది. డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నది. ఇటీవల డీడబ్ల్యూవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు ఆ యువతికి జనగామ జిల్లా రఘునాథపల్లి చెందిన రాజేశ్‌తో పెండ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ పెళ్లి పెద్దగా వ్యవహరించేందుకు ముందుకొచ్చారు. ఈ నెల 21న పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో పెండ్లి వేడుకలు నిర్వహించేందుకు వడివడిగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా అధికారులు, స్వ చ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా తమ వంతుగా సాయం అందించనున్నారు.



## వివాహ వేడుకల్లో ప్రముఖులు

రామడుగు, మే 16 : 'నమస్తే తెలంగాణ' దినపత్రిక కరీంనగర్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావు కూతురు వివాహం శుక్రవారం రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్‌రోడ్ వద్ద వసుధ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి 'నమస్తే తెలంగాణ' సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ చిరంజీవులు, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



# మెడికల్ కాలేజీలో ఉద్యోగాల దందా?

- కళాశాలలోని ఓ అధికారి చేతివాటం
- తండ్రి స్థానంలో కొడుక్కు నౌకరి
- ఔట్ సోర్సింగ్ కింద అతని కుటుంబ సభ్యుల నియామకం
- వారధిని సైతం ఏమార్చిన సదరు ఆఫీసర్
- 52 కొత్త పోస్టుల్లోనూ పైరవీలు
- బయటికి రావడంతో నిలిచిన నియామకాలు
- వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- లేఖలు రాసినా పట్టని ఉన్నతాధికారులు

**కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల దందా నడుస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్య పోస్టులో ఉన్న ఓ అధికారి ఈ విషయంలో కీలకంగా ఉన్నట్టు తెలుస్తున్నది. వారధి సంస్థను ఏమార్చి మెరిట్‌తో సంబంధం లేకుండా తన కుటుంబ సభ్యులు ఇద్దరికి ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో నియమించుకున్నట్టు సమాచారం. కళాశాల ఏర్పాటు కాకముందు సీడ్ గోదాముల్లో పనిచేసే హమాలీలకు ఉద్యోగాలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం చెప్పగా, తండ్రి స్థానంలో కొడుక్కు ఉద్యోగం ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అందుకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్టు తెలుస్తున్నది. తిరిగి కొత్తగా వారధి ద్వారా 52 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇవ్వగా, ఇదే దందా కొనసాగినట్టు తెలిసి నియామకాలు నిలిపి వేసినట్టు తెలిసింది.**

కరీంనగర్, మే 16 (నమస్తే తెలంగాణ)/ విద్యానగర్ : కరీంనగర్ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట పెద్ద దందానే నడుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కళాశాలలో కీలక పోస్టులో ఉన్న ఓ అధికారి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో వారధి సంస్థను కూడా తప్పుదారి పట్టించినట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో తెలంగాణ విత్తనోత్పత్తికి సంబంధించిన గోదాములను రెనోవేషన్ చేసి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే, ఇక్కడ పని చేస్తున్న హమాలీలు తమకు ఉపాధి పోతుందని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించుకోగా మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇదే అదునుగా ఆ అధికారి దందాకు తెరలేపినట్లు తెలుస్తున్నది. తండ్రి స్థానంలో కొడుక్కు ఉద్యోగం ఇచ్చి ₹2 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా, గతంలో అవసరమైన పది మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఔట్ సోర్సింగ్ కింద ఎంపిక చేసేందుకు కరీంనగర్ కలెక్టరేట్‌లోని వారధి ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చారు. అందులో పది మందిని ఎంపిక చేయగా ఒకరికి ప్రభుత్వోద్యోగం రావడంతో రాజీనామా చేసి వెళ్లారు. మరొకరు ఆ సమయంలో టెట్ నోటిఫికేషన్ రావడంతో చదువుకోవాలనే ఉద్దేశంలో ఆమె కూడా మానేసింది. వారధిలో నమోదైన సీనియార్టీ, మెరిట్ ఆధారంగా మెడికల్ కళాశాలకు అవసరమైన పది మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లలో ఎనిమిది మందిని మాత్రమే నియమించారు. ఆ తర్వాత సీనియార్టీని పక్కన పెట్టి, మెరిట్‌తో సంబంధం లేకుండా ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. ఈ ఇద్దరు మెడికల్ కళాశాలలో కీ పోస్టులో ఉన్న అధికారి కుటుంబ సభ్యులేనని తెలుస్తున్నది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు వారధి నుంచి తీసుకున్నప్పుడు సదరు సంస్థలో రిజిస్టర్ అయి ఉన్న సీనియార్టీ ప్రకారం, మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ, ఈ రెండు ఉద్యోగాల్లో వారధి నిబంధనలు గాలికి వదిలేసి తన కుటుంబ సభ్యులను నియమించుకున్నారని సదరు అధికారిపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

### ఫిర్యాదు చేసినా పట్టింపేది?

మెడికల్ కళాశాలలో పని చేస్తున్న అధికారి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలకు పాల్పడిన విషయాన్ని ఇదే కళాశాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగానే వారధిలో నమోదైన నిరుద్యోగుల నుంచి 400లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో పది మందిని ఎంపిక చేయగా ఇద్దరు మానుకున్నారు. వారి స్థానంలో మెరిట్ ప్రకారంగా తర్వాతి స్థానాల్లో ఉన్న వారిని నియమించాల్సి ఉంటుంది. కానీ, అందుకు భిన్నంగా ఎలాంటి మెరిట్ లేకున్నా సదరు అధికారి తన కుటుంబ సభ్యులు ఇద్దరి ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇప్పించుకున్నాడని కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నెలకు ₹1.50 లక్షల వేతనం తీసుకుంటున్న ఈ అధికారి కుటుంబానికి చెందిన వారికే ఉద్యోగాలు ఇవ్వడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

### ఆగిన మరిన్ని నియామకాలు?

మెడికల్ కళాశాల నిర్వహణ కోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విరివిగా అవసరం ఉంటారు. మొదట నియమించిన పది మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లే కాకుండా గతేడాది అక్టోబర్‌లో మరో 52 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ వేశారు. అందులో ల్యాబ్ అటెండెన్స్15, స్టోర్ కీపర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 7, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్స్ 8, అనస్తీషియా టెక్నీషియన్స్ 4, దోబీ 4, ఎలక్ట్రీషియన్స్ 2, ప్లంబర్ 1, డ్రైవర్ 1, థియేటర్ అసిస్టెంట్లు 4, గ్యాస్ ఆపరేటర్లు 2, వార్డు బాయిస్ 4 పోస్టులు ఔట్ సోర్సింగ్ కింద భర్తీ చేయాలి. ఈ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నియామకాలు చేపట్ట లేదు. అయితే, ఈ విషయంలో కూడా సదరు అధికారి జోక్యం చేసుకోవడంతో పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు, డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలియడంతో నియామకాలు నిలిపివేసినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తిష్ట వేసిన ఈ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మెడికల్ కళాశాల ఉన్నతాధికారులను, డీఎంఈ అధికారులను కూడా ఈ అధికారి తప్పుడు సమాచారం ఇస్తూ ఏమార్చుతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ జరిపితే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మళ్లీ వెలుగులు రావాలి

- ప్రజాస్వామ్య పోరాటంతోనే అది సాధ్యం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



కమాన్‌పూర్ : కేక్ కట్ చేస్తున్న పుట్ట మధూకర్, మహిళా నాయకులు

కమాన్‌పూర్ మే 16 : మంథని నియోజవకర్గానికి మళ్లీ వెలుగులు రా వాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆకాంక్షించారు. అది ప్రజాస్వామ్య పో రాటంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో ప్రజాస్వామ్య పోరాటానికి శ్రీకారం చుట్టా రు. ముందుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, ఆలయంలో పూజలు చేశారు. కేక్ కట్ చేసిన అనంతరం ప్రజాస్వామ్య పోరాట లోగోను ఆవిష్కరించారు. తండ్రి తర్వాత తమ్ముడు, కొడుకు ఇలా వారసులవ్వడం కాదని, ఈ మట్టిలో పుట్టిన బిడ్డను ఎమ్మెల్యే చేయాలన్నదే ఈ ప్రజాస్వామ్య పోరాట లక్ష్యమని చెప్పారు. రొంపికుంటలో ఎంతో మంది చైతన్యవంతులు ఉన్నారని, ఇక్కడి నుంచే చైతన్యం మొదలు కావాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించకపోతే చీకటి పాలనను అంతం చేయలేమని తెలిపారు. నలభై ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లు వేసి అవకాశం ఇస్తే ఏం చేశారో ఆలోచన చేయాలని సూచించారు. సమీపంలోనే ఉన్నా రొంపికుంట గ్రామానికే మేలు జరగకపోతే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, అగ్రవర్ణాల్లోని పేదలకు ఏ విధంగా మేలు జరుగుతుందో ఆలోచన చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే తమపై అక్రమ కేసులు పెట్టారని, మహాముత్తారం, రామగిరి, మంథని, కమాన్ పూర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని, మరికొందరు నాయకులపై రౌడీషీట్లు ఓపెన్ చేశారని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో తాము ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదని, ఎవరు ధర్నా చేసినా ఆందోళనలు చేసినా కేసులు పెట్టించలేదన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్లు పని చేయడం లేదని, గోదావరిఖని ఏసీపీ కార్యాలయం నుంచే నడుస్తున్నాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేపై కేసులు పెట్టేందుకే ఇక్కడ పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే అక్రమ కేసులు పెడితే ఎలా అని ప్రశ్నించారు. పోలీసులు పద్ధతి మార్చుకోకపోతే పోలీస్ స్టేషన్‌లకు కాంగ్రెస్ కార్యాలయాలని బోర్డులు పెట్టాల్సి వస్తుందని, ఆ పరిస్థితిని తీసుకురావద్దని హితవుపలికారు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా ఉండే మంథని ఎమ్మెల్యే ఏ ఒక్క పథకంలో మార్పు తీసుకురాలేదని, ఆనాడు చెప్పివన్నీ అధికారం కోసం ఆడిన అబద్ధాలేనని మండిపడ్డారు. శ్రీపాద ట్రస్టు ద్వారా పేదలకు ఎందుకు సేవలు చేయడం లేదని, కాటారంలో ఓ ఎస్సీ బిడ్డ మెడిసిన్ సీటుకు ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నానని మొరపెట్టుకున్నా ఎందుకు సాయం చేయడం లేదని ప్రశ్నించారు. మంథని ఎమ్మెల్యే ఊకదంపుడు మాటలకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

## పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాల్సిందే

- లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తాం
- సీపీఐ నాయకుల హెచ్చరిక




ర్యాలీ తీస్తున్న సీపీఐ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి, తదితరులు

హుజూరాబాద్ టౌన్, మే 16: హుజూరాబాద్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన 570 డబుల్ బెడ్రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పంపిణీ చేయకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లో చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. భారీగా పోలీసు బలగాలు మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గంటపాటు హుజూరాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ర్యాలీ వద్దకు వచ్చి తహసీల్దార్ కనకయ్య సీపీఐ నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. నెల రోజుల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం చాడ వెంకటరెడ్డి, మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ.. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని గణేశ్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌కు పలుసార్లు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, పేదలకు ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

## 'హాయ్.. ఐయామ్ పూజ'

- అమ్మాయి పేరిట యువకుడికి ముగ్గురు యువకుల వల
- కామవాంఛ తీరుస్తానంటూ రప్పించి దోపిడీ
- బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరి అరెస్ట్

కరీంనగర్, మే 16 (నమస్తే తెలంగాణ) : జల్సాలకు అలవాటు పడ్డ ఓ ముగ్గురు యువకులు, అమ్మాయి పేరిట ఓ యువకుడికి వల వేశారు. కామవాంఛ తీరుస్తానంటూ రప్పించి దోపిడీ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరు నిందితులను కొత్తపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి సమక్షంలో కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి శుక్రవారం అరెస్ట్ చూపారు. వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్‌కు చెందిన సరళ సందీప్ (19), లక్ష్మీపూర్‌కు చెందిన తన స్నేహితులు పొన్నాల ప్రణయ్ కుమార్ (18), ఎండీ రహమాన్ జాల్సాలకు అలవాటు పడ్డారు. అమ్మాయిల ఎర చూపి దోపిడీకి పాల్పడాలని కొత్త పథకం వేశారు. ఈ నెల 6న సందీప్ మంచిర్యాల ప్రాంతానికి చెందిన హరిబాబు (25)కు 'హాయ్.. ఐయామ్ పూజ' అంటూ మెస్సేజ్ చేశాడు. హరిబాబు స్పందించి చాటింగ్ చేయడంతో కామవాంఛ తీర్చుతానంటూ ఎరవేశాడు. అందుకు కరీంనగర్ రావాలని చాటింగ్‌లో సూచించాడు. ఇది నమ్మిన హరిబాబు ఈ నెల 11న కరీంనగర్‌కు వచ్చి, తాను చాటింగ్ చేసిన నంబర్‌కు ఫోన్ చేశాడు. వారు కొత్తపల్లికి రావాలని చెప్పడంతో అక్కడికి వెళ్లాడు. అయితే ఆ ముగ్గురు యువకులు ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం.. ఎండీ రహమాన్ వెలిచాల శివారులోని పంట పొలాల్లో ఉన్నాడు. మిగతా ఇద్దరు యువకులు హరిబాబును బైక్‌పై అక్కడికి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారు. ₹50 వేలు కావాలని డిమాండ్ చేశారు. దీంతో హరిబాబు తన వద్ద ఉన్న ₹10 వేలు ఇచ్చాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి, మరో ₹12 వేలు ఫోన్ పే ద్వారా తెప్పించుకుని ఫోన్‌కు పంపించాడు. దీంతో ఆ ముగ్గురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు హరిబాబు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల బృందం గాలించారు. శుక్రవారం రేకుర్తి బస్టాండ్‌లో ఇద్దరు యువకులను గుర్తించి పట్టుకున్నారు. వీరి నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. మరొకరు పరారీలో ఉండగా సందీప్, ప్రణయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా, ప్రధాన నిందితుడు సందీప్ గతంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడి వరంగల్‌లోని జువైనల్ హోంలో శిక్ష అనుభవించి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## మట్టి లారీల అడ్డగింత

ఓదెల, మే 16 : కొలనూర్ గ్రామంలోని అప్పమాయ చెరు వు మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులు లారీల్లో ఓవర్ లోడ్‌తో తీసుకువెళ్తూ, నిబంధనలకు విరుద్ధంగా చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న కారణంగా శుక్రవారం లారీలను గ్రామస్తులు అడ్డగించారు. కొలనూర్ చెరువులో నల్లమట్టిని తీసుకోవడానికి కలెక్టర్ నుంచి పర్మిషన్ తీసుకున్నారు. అయితే ఇక్కడ లారీలో ఓవర్ లోడ్‌తో తీసుకువెళ్తున్నారని, కాగా, ఎన్ని టైర్ల లారీలో తీసుకువెళ్లేది లేని కారణంగా ఇటుక బట్టీల యాజమానులు పెద్దపెద్ద లారీలతో అధికంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. చెరువులో ఒక మీటర్ లోతు మాత్రమే తీయాల్సి ఉండగా, ఇష్టారాజ్యంగా తీస్తున్నట్లు తెలిపారు. ఈ కారణాలతో తాము లారీలను అడ్డుకుంటే తమను పోలీస్ స్టేషన్ తరలించి అక్రమంగా కేసులు బనాయిస్తున్నట్లు గ్రామస్తులు జక్కుల మధు, రేగుల తిరుపతి, మద్దెల శ్రీనివాస్, సాతూరి అనిల్ ఆరోపించారు. తాము న్యాయంగా నిలదీస్తే అధికారులు, పోలీసులు తమను బెదిరిస్తున్నట్లు వారు చెప్పారు.

### సబ్ ఇంజినీర్ సస్పెన్షన్

ముకరంపుర, మే 16: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సబ్ డివిజన్2 కార్యాలయంలో పనిచేస్తున్న సబ్‌ఇంజినీర్ దూట చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సర్కిల్లోని లాగిన్స్‌ను అనధికారికంగా వాడి దుర్వినియోగం చేసినందుకు సస్పెండ్ చేసినట్టు ఎస్ఈ తెలిపారు.

## సార్లు కొట్టుకున్నరు!

- అడ్డొచ్చిన ఎంఈవోపైనా దాడి.. విరిగిన చేయి
- ధర్మపురి మండలం దోనూర్‌లో ఘటన



టీచర్లు దాడి చేసుకున్న ఘటనలో గాయపడ్డ మండల విద్యాధికారి సీతాలక్ష్మి

ధర్మపురి, మే 16 : విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పాల్సిన ఉపాధ్యాయులు విచక్షణ కోల్పోయారు. పేరెంట్ టీచర్ సమావేశం సాక్షిగా తన్నుకున్నారు. శుక్రవారం ధర్మపురి మండలం దోనూర్ జడ్పీహెచ్ఎస్‌లో పీటీఏ సమావేశం నిర్వహించారు. అయితే, జడ్పీహెచ్ఎస్ పక్కనే ఎంపీపీఎస్ పాఠశాల ఉండడంతో రెండు పాఠశాలలకు కలిపి సంయుక్తంగా ఏర్పాటు చేశారు. అందులో దోనూర్ హెచ్ఎం (ధర్మపురి ఎంఈవో) సీతాలక్ష్మి పాల్గొని, బడిబాట, తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశం అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల ఆరు బయట మాట్లాడుకుంటుండగా.. జడ్పీహెచ్ఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న గడిపెల్లి మహేశ్, పక్కనే ఉన్న ఎంపీపీఎస్ ఎస్జీటీ కాశెట్టి రమేశ్‌పై ఒక్కసారిగా దాడికి దిగాడు. రమేశ్‌ను పిడిగుద్దులు గుద్దుతూ ఉండగా అక్కడే ఉన్న ఎంఈవో సీతాలక్ష్మి వారిని గొడవ ఆపాలని అడ్డుకునే ప్రయత్నం చేసింది. కానీ, ఉపాధ్యాయుడు మహేశ్ ఎంఈవోపై మహిళ అని కూడా చూడకుండా దాడిచేసి, దుర్భాషలాడుతూ నెట్టివేయడంతో ఆమె ఎడమ చేతి మణికట్టు విరిగింది. అయితే, మహేశ్ ప్రవర్తన బాగోలేదని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం వల్లనే కక్ష పెంచుకొని దాడికి దిగాడని ఎంఈవో తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## నిశ్చయం ఒకరితో.. పెళ్లి మరొకరితో..

- యువకుడి మోసంతో ఆగిన వివాహం
- ఆందోళనలో యువతి కుటుంబసభ్యులు

హుజూరాబాద్ రూరల్, మే16 : పెళ్లికి ఒప్పుకున్నాడు.. పెళ్లి తేదీ దాకా వేచి చూశాడు. ఎల్లుండి పెండ్లి అనగా జెండా ఎత్తి మరొకరిని వివాహం చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ రెడ్డి చిన్న కొడుకు మధుకర్ రెడ్డికి అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి చేయాలని నెల క్రితం నిశ్చయించారు. ఈ నెల 16న అంటే శుక్రవారం వివాహం జరిపించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. బట్టలు, బంగారం ఇతర అవసరమైన వస్తువులన్నీ కొన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు పత్రికలు కూడా పంచారు. ఇరు కుటుంబాల్లోనూ పెళ్లి సంబురంలో మునిగితేలుతున్నారు. కానీ, అంతలోనే అబ్బాయి మధుకర్ రెడ్డి పిడుగులాంటి వార్త పేల్చాడు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మరో అమ్మాయిని పెళ్లి చేసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలియడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అమ్మాయి బంధువులు గురువారం రంగాపూర్ చేరుకొని ఆందోళన చేశారు. దీంతో అబ్బాయి కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.

## అక్క చేసుకోలేదని.. చెల్లిని ఇద్దామనుకున్నరు!

- ఆ అమ్మాయి మైనర్‌గా గుర్తింపు
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్.. పెళ్లి నిలిపివేత

ఎల్లారెడ్డిపేట, మే 16: పెళ్లికి అక్క నిరాకరించిందని చెల్లిని కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు తల్లిదండ్రులు.. కానీ, ఆ అమ్మాయి మైనర్ కావడంతో పెండ్లిని నిలిపివేశారు అధికారులు.. అధికారులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం ఓ గ్రామానికి చెందిన యువతికి ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. కానీ, అనుకోని కారణాలతో చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో తల్లిదండ్రులు ఆ యువకుడికి తమ చిన్న కూతురును ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం పెళ్లి జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ, ఆ అమ్మాయికి మైనార్టీ తీరలేదన్న విషయం తెలియడంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు గ్రామానికి చేరుకొని, తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. మైనార్టీ తీరకుండా చేసే పెళ్లిళ్లతో జరిగే అనర్థాలను వివరించారు. అయినా బంధువులు వినకుండా అధికారులతో గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నించగా, సమాచారం తెలుసుకొని పోలీసులు వచ్చారు. తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లిని నిలిపివేశారు.